సాక్షి హైదరాబాద్

గురువారం । 9 । నవంబర్ । 2023

1



అక్కా చెల్లెళ్లూ.. ఆలోచించి ఓటేయండి



ఈసీ నగర్‌లో లక్ష్మారెడ్డికి మంగళహారతులతో స్వాగతం పలుకుతున్న మహిళలు..

ఉప్పల్ బీఆర్ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డికి మద్దతుగా బుధవారం మల్లాపూర్ వీఎస్ఆర్ గార్డెన్‌లో నిర్వహించిన మహిళా ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి హరీశ్‌రావు ముఖ్య అతిథిగా మాట్లాడారు. కేసీఆర్ వచ్చాక ఏం చేశారు.. కాంగ్రెస్ ఏం చేసిందో.. అక్కా చెల్లెళ్లు ఆలోచన చేయాలని ఆయన సూచించారు. కారు గుర్తుకు ఓటు వేసి బండారి లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. – మల్లాపూర్



ర్యాలీలో నృత్యం చేస్తున్న యువతి

'దానం' నామినేషన్.. ధూం.. ధాం

ఖైరతాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి దానం నాగేందర్ బుధవారం నామినేషన్ వేశారు. ఈ సందర్భంగా ఆటాపాటలతో అట్టహాసంగా ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఎన్నికలోనూ నాగేందర్ నామినేషన్ వేసే క్రమంలో ఆయన భార్య, కూతుళ్లు ఎదురెళ్లి ఆయనకు బెస్ట్ విషెస్ చెబుతారు. ఇదే సెంటిమెంట్‌ను వారు కొనసాగించారు. ర్యాలీలో మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, మేయర్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. – ఖైరతాబాద్

తొలి ఓటు ఎవరికో!



యువ ఓటర్లపై అభ్యర్థుల నజర్

- గ్రేటర్‌లో మొదటిసారి ఓటేయనున్న 1.8 లక్షల మంది
- వీరిని ఆకర్షించేందుకు సోషల్ మీడియా వేదికగా అభ్యర్థుల ప్రచారం
- ఉద్యోగ అవకాశాలు, అభివృద్ధే ప్రధాన ఎజెండా
- నోటా నొక్కుతారేమోనని అభ్యర్థుల్లో టెన్షన్
- గత ఎన్నికల్లో చాలా చోట్ల మెజారిటీ కంటే నోటా ఓట్లే ఎక్కువ

సాక్షి, సిటీబ్యూరో: ఎన్నికల్లో తొలి ఓటు అత్యంత కీలకం. అందుకే మొదటిసారి ఓటు వేసేందుకు సిద్ధమవుతున్న యువ ఓటర్లను ఆకర్షించే పనిలో పడ్డాయి ప్రధాన రాజకీయ పార్టీలు. గ్రేటర్‌లోని చాలా నియోజకవర్గాల్లో తొలి ఓట్లే అభ్యర్థుల గెలుపోటములను నిర్ణయించే స్థాయిలో కీలకంగా మారాయి. 'నచ్చితే ఓటేస్తాం.. లేకపోతే నోటాకు సై అంటాం' అనే యువతరం ధోరణితో అభ్యర్థుల్లో టెన్షన్ నెలకొంది. గతంలో ఎన్నికలు, ఓటు అంటే అంతగా ఇష్టం చూపని యువతరంలో క్రమంగా మార్పు వచ్చింది. సామాజిక మాధ్యమాల వేదికగా ప్రశ్నించే తత్వం పెరిగింది. ఓటుతో సమాధానం చెప్పాలని నిర్ణయించుకునే స్థాయిలో వారి ఆలోచనా ధోరణిలో మార్పులొచ్చాయి.

ఉద్యోగాలు, అభివృద్ధే ఎజెండా..

గ్రేటర్ హైదరాబాద్‌లో 18– 19 ఏళ్లున్న ఓటర్లు 1.8 లక్షల మంది ఉండగా.. 18– 29 ఏళ్ల వయసున్న ఓటర్ల సంఖ్య 17.3 లక్షలు. ఈ యువ ఓటర్లను ఆకర్షించేందుకు ప్రధాన రాజకీయ పార్టీలు దృష్టి సారించాయి. సాంకేతికత అందుబాటులో సమస్త సమాచారం అరచేతిలోకి వచ్చేసింది. దీంతో యువ ఓటర్ల సామాజిక ఆలోచనలు మారిపోయాయి. రాజకీయాలు, ఎన్నికలు, అభ్యర్థులు, అభివృద్ధి, ప్రజా సమస్యలపై అవగాహన కలిగి ఉంటున్నారు. రాజకీయ పార్టీల విధానాలను ఎప్పటికప్పుడు సామాజిక మాధ్యమాల ద్వారా ఎండగడుతున్నారు. అభ్యర్థుల గుణగణాలను ఉతికి పారేస్తున్నారు. ప్రజాధనం దుర్వినియోగం, స్కాంలు, అవినీతి వంటి వాటిపై నిర్భయంగా ప్రశ్నిస్తున్నారు. అభివృద్ధి, ఉచిత విద్య, వైద్యం, ఉద్యోగం కల్పించే పార్టీలకు ఓటు వేస్తామని పేర్కొంటున్నారు.


ఎన్నెన్నో పాట్లు..

యువ ఓటర్లను ఓటు హక్కు వినియోగించుకునేలా ఎన్నికల సంఘం, పలు స్వచ్ఛంద సంస్థలు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాయి. ఈ యువ ఓటర్లను చేరుకునేందుకు ప్రధాన రాజకీయ పార్టీలు ఫేస్‌బుక్, ఎక్స్ (ట్విట్టర్), ఇన్‌స్టాగ్రాం వంటి సామాజిక మాధ్యమాల వేదికగా చేసుకుంటున్నాయి. షార్ట్ వీడియోలు, రీల్స్ చేస్తూ జోరుగా ప్రచారం చేస్తున్నాయి. కేటీఆర్, మల్లారెడ్డి, శ్రీనివాస్ గౌడ్ వంటి పలువురు బీఆర్ఎస్ అభ్యర్థుల సోషల్ మీడియా ఖాతాలకు లక్షల సంఖ్యలో ఫాలోవర్లు ఉన్నారు. బస్తీలు, కాలనీల్లోని యువ ఓటర్లను ఆకర్షించేందుకు క్రికెట్ కిట్లు, పండగలకు సాంస్కృతిక కార్యక్రమాలు, యువతుల కోసం ఎలక్ట్రిక్ వాహనాలు, స్మార్ట్ వాచ్‌లు వంటివి పంపిణీ చేస్తున్నారు.

అభ్యర్థుల్లో నోటా టెన్షన్..

ప్రస్తుత ఎన్నికల్లో నోటా ఓట్ల చీలిక చిన్నదే అయినా కొంతమంది అభ్యర్థుల గుండెల్లో గుబులు పుట్టిస్తోంది. కొద్దిపాటి తేడాతో ఓడిపోయిన స్థానాల్లో మెజారిటీ కంటే నోటాకే ఎక్కువ ఓట్లు వస్తున్నాయి. దీంతో అభ్యర్థులకు నోటా టెన్షన్ పట్టుకుంది. ఆ ఉదంతాలు ఇలా..

- 2018 శాసనసభ ఎన్నికలలో అంబర్‌పేట టీఆర్ఎస్ అభ్యర్థి కాలేరు వెంకటేష్, బీజేపీ నుంచి కిషన్ రెడ్డిపై కేవలం 1,016 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఇక్కడ నోటాకు పడిన ఓట్లు 1,462.
- మహేశ్వరంలో సబితా ఇంద్రారెడ్డి టీఆర్ఎస్ అభ్యర్థి తీగల కృష్ణా రెడ్డిపై 9,227 ఓట్ల మెజారిటీతో గెలిచారు. ఇక్కడ నోటా ఓట్లు 2,171.
- ఇబ్రహీంపట్నంలో టీఆర్ఎస్ అభ్యర్థి మంచిరెడ్డి కిషన్‌రెడ్డి.. బీఎస్పీ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డిపై కేవలం 376 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఈ నియోజకవర్గంలో పోలైన నోటా ఓట్లు 1,151.
- వికారాబాద్ (ఎస్సీ) నియోజకర్గంలో టీఆర్ఎస్ నుంచి డాక్టర్ ఆనంద్ మెతుకు కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం ప్రసాద్ కుమార్‌పై 2,993 ఓట్ల తేడాతో గెలుపొందాడు. ఇక్కడ నోటా ఓట్లు 1,531.
- ఖైరతాబాద్‌లో 35 మంది అభ్యర్థులు ఎన్నికలలో పోటీ చేయగా.. అందరిని పక్కన నెట్టి నోటా 5వ స్థానంలో నిలిచింది.



నడక నరకమే

- స్కైవేలు సరే.. • నడకదారులేవీ?
- నగరంలో యమయాతన • ప్రతియేటా ప్రమాదాలు



సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ నగరంలో ఎన్నో ఫ్లై ఓవర్లు, ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణాలు చేపట్టినా.. స్కైవేలు రానున్నా.. ప్రజలకు చాలినన్ని నడక దారులు మాత్రం అందుబాటులో లేవు. దీంతో ప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయి. నగరంలో 9,100 కి.మీ మేర రహదారులున్నాయి. ఇందులో పది శాతం ఫుట్‌పాత్‌లు కూడా లేవు. వేలాది కోట్ల రూపాయల వ్యయంతో భారీ ప్రాజెక్టులు పూర్తి చేసినప్పటికీ.. రూ.100 కోట్ల ఫుట్‌పాత్‌లు కూడా నిర్మించలేదు. వాహనదారుల సాఫీ ప్రయాణం కోసం సిగ్నల్‌ఫ్రీగా ఉండేలా వివిధ ఫ్లై ఓవర్లతో పాటు వారికి ప్రయాణ సమయం, ఇంధన వ్యయం, కాలుష్యం తగ్గేలా, ఫ్లై ఓవర్లతోపాటు లింక్ రోడ్లు కూడా నిర్మిస్తున్నప్పటికీ నడిచేవారికి అవసరమైన ఫుట్‌పాత్‌లపై ప్రభుత్వాలు శ్రద్ధ చూపడంలేదు. దీంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అడపాదడపా ప్రాణాలు పోతున్నాయి.

ఉన్నా నడవలేరు..

ఉన్న ఫుట్‌పాత్‌లే తక్కువ కాగా, అవి సైతం ప్రజల నడకకు ఉపయోగపడటం లేదు. వాటిపైనే దుకాణాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, పబ్లిక్ టాయ్‌లెట్లు, వాటర్ ఏటీఎంలు, చెట్లు, అన్నపూర్ణ భోజన కేంద్రాలు ఉన్నాయి. దీంతో ఆటంకాలు లేకుండా కనీసం యాభై మీటర్లు కూడా నడిచే పరిస్థితి లేదు. ఈ దుస్థితి మారుస్తారేమోనని ఎదురు చూస్తున్న పాదచారుల సమస్యల్ని పట్టించుకుంటున్న వారే లేకుండాపోయారు. కొత్త ప్రభుత్వాలు ఏర్పడుతున్నా ఏళ్లుగా ఉన్న పాత సమస్య.. పాదచారుల అవస్థలు మాత్రం తీరడం లేదు. తాము నడిచేందుకు తగిన విధంగా, ఫుట్‌పాత్‌లుండాలని, అన్నిప్రధాన రహదారుల వెంబడీ సదుపాయంగా నడిచేంత వెడల్పుతోవాటిని నిర్మించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

గత ఆరేళ్లలో నిర్మించిన ఫుట్‌పాత్‌లు.. వాటికైన వ్యయం

సంవత్సరం	ఫుట్ పాత్‌లు	వ్యయం (రూ.కోట్లలో)
2017	63	2.67
2018	95	7.20
2019	105	12.80
2020	89	17.96
2021	86	20.99
2022	49	18.90

- గడచిన పదేళ్ల కాలంలో కనీసం 400 కి.మీ ఫుట్‌పాత్‌లు కూడా నిర్మించలేదు.
- రెండేళ్లక్రితం జోన్‌కు కనీసం పది కిలోమీటర్లయినా ఫుట్‌పాత్‌లు నిర్మించాలని మంత్రి కేటీఆర్ ఆదేశించినా పనులు పూర్తి కాలేదు.
- సీఆర్ఎంపీ కింద రోడ్ల నిర్మాణం చేపట్టిన ఏజెన్సీలు సైతం ఫుట్‌పాత్‌లను పట్టించుకోవడం లేదు.

అలర్ట్

ఇంకా కొన్ని గంటలే

- నామినేషన్ల దాఖలుకు దగ్గరపడిన సమయం
- అయినా అభ్యర్థులే తేలని అయోమయ పరిస్థితి
- బీజేపీలో అత్యధికంగా ఐదు నియోజకవర్గాల్లో..
- చార్మినార్‌లో కాంగ్రెస్‌కు సైతం..
- రెండు పార్టీల్లోనూ పొత్తులతో కిరికిరి

సాక్షి, సిటీబ్యూరో: నామినేషన్ల ఘట్టం ముగియడానికి మరికొన్ని గంటల సమయమే మిగిలి ఉంది. ఈ నెల 3వ తేదీ నుంచి నామినేషన్ల పర్వం ప్రారంభం కాగా, రేపు (శుక్రవారం) మధ్యాహ్నం 3 గంటలకు గడువు ముగియనుంది. దీంతో ఇంతవరకు నామినేషన్లు దాఖలు చేయని అభ్యర్థులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. తిథుల రీత్యానూ గురు, శుక్రవారాలు శుభ దినాలుగా భావిస్తుండటంతో ఎక్కువ మంది నామినేషన్లు దాఖలు చేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

టెన్షన్.. టెన్షన్

ఆయా పార్టీల నుంచి టికెట్లు లభించిన వారు ఏర్పాట్ల హడావుడిలో ఉండగా, అభ్యర్థులను ప్రకటించని నియోజక వర్గాల్లో టిక్కెట్లను ఆశిస్తున్న ఆశావహుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. విడతల వారీగా అభ్యర్థులను ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ చార్మినార్ సీటును ఇంతవరకు ఎవరికీ కేటాయించలేదు. సీపీఐతో పొత్తు కుదుర్చుకున్న కాంగ్రెస్ చార్మినార్ సీటును దానికి కేటాయించనుందనే ప్రచారం జరుగుతోంది. అందువల్లే ఆ సీటుకు అభ్యర్థిని ప్రకటించలేదని చెబుతున్నారు.

బీజేపీలో జనసేన కిరికిరి

బీజేపీ జనసేనతో పొత్తు పెట్టుకోవడంతో గ్రేటర్ పరిధిలోని సీట్లపైనా ఆ ప్రభావం పడుతోంది. ముఖ్యంగా శేరిలింగంపల్లి, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, మల్కాజిగిరి, మేడ్చల్ స్థానాలను అది ఆశించగా కుత్బుల్లాపూర్ స్థానాన్ని బీజేపీ అభ్యర్థి కూన శ్రీశైలం గౌడ్‌కు ఇచ్చారు. కూకట్‌పల్లిని జనసేనకు కేటాయించడంతో అది తన అభ్యర్థిగా ప్రేమ్‌కుమార్‌ను ప్రకటించింది. ఇటీవలి కాలం వరకు బీజేపీలో ఉన్న ప్రేమ్‌కుమార్ జనసేనలో చేరి వెంటనే టికెట్ దక్కించుకున్నారు. శేరిలింగంపల్లిని జనసేనకు కేటాయించకుండా ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డి అధిష్టానంతో జరిపిన సంప్రదింపుల్లో ఆ మేరకు సఫలమైనట్లు సమాచారం. అయినప్పటికీ ఇప్పటి వరకు అభ్యర్థిని ప్రకటించకపోవడంతో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. మల్కాజిగిరి, మేడ్చల్, నాంపల్లి, కంటోన్మెంట్ స్థానాల్లోనూ అభ్యర్థులను ప్రకటించకపోవడంతో పొత్తులో భాగంగా ఆ సీట్లు ఎవరికి దక్కనున్నాయనేది సస్పెన్స్‌గా మారింది.

కారును గెలిపిస్తే.. మీ జీవితాలు వడ్డించిన విస్తరే



బేగంపేటకు చెందిన కళాకారుడు పురుషోత్తం విస్తరాలకుపై సీఎం కేసీఆర్, కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, బీఆర్ఎస్ కారు గుర్తు చిత్రాలను గీసి.. ఎన్నికల ప్రచారంలో ఉన్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు అందించడంతో ఆయన అభినందించారు. - సనత్‌నగర్

చంటోడి సాక్షిగా మీ ఓటు నాకే..



హబ్సిగూడలో బుధవారం ఉప్పల్ కాంగ్రెస్ అభ్యర్థి మందముల పరమేశ్వర్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పరమేశ్వర్‌రెడ్డి ఓ చంటిపిల్లాడిని ఎత్తుకుని ఆప్యాయంగా ముచ్చటించారు. - ఉప్పల్

అందరివాడిని.. ఆదరించండి



ఎన్నికల ప్రచారంలో భాగంగా కుత్బుల్లాపూర్‌లో కార్యకర్తలతో కలిసి బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే వివేకానంద్ పాదయాత్ర చేశారు. తాను అందరివాడినని.. తనను ఆదరించాలని ఓటర్లను కోరారు. - కుత్బుల్లాపూర్

సెలబ్రిటీ కామెంట్: భవిష్యత్‌ను నిర్ణయించేది ఓటే



మెరుగైన సామాజిక భవిష్యత్‌ను నిర్ణయించేది ఓటు హక్కు మాత్రమే. మంచి నాయకులను ఎన్నుకోవడానికి సరైన సమయం ఇదే. ఎన్నికల వేళ చేసే ఒకే ఒక్క పొరపాటుతో వ్యక్తిగతంగా, సామాజికంగా భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దు. ముఖ్యంగా యువత ఓటు హక్కును వినియోగించుకోవాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ ఓటును అమ్ముకోవద్దు. ఓటు విలువను తెలుసుకుని సద్వినియోగం చేసుకోవాలి. సామాజికంగా డబ్బు, కులం తదితర స్థాయిలుగా అసమానతలు నెలకొన్నాయి. కడుపు నిండినోళ్లు, కడుపు మండినోళ్ల మధ్య వ్యవస్థ కొనసాగుతోంది. ఎన్నికైన ప్రజాప్రతినిధులు సామాన్యుల పక్షాన నిలుస్తూ కనీస అవసరాలు సమకూర్చేలా కృషి చేయాలి. సమ న్యాయపాలన చేస్తూ వెనుకబడిన వారి ఉన్నతికి కోసం ప్రయత్నించే వారే అసలైన నాయకులు.

– రఘు కుంచె, సంగీత దర్శకుడు– ప్లే బ్యాక్ సింగర్

డ్రీమ్ సిటీ: అంతర్జాతీయ స్థాయిని అందుకోవాలి



అంతర్జాతీయ స్థాయి నగరంగా మారడానికి అన్ని హంగులూ ఉండడంతో ఆ దిశగా హైదరాబాద్ శరవేగంగా అభివృద్ధి చెందుతోందనడంలో ఎలాంటి సందేహం లేదు. అయితే.. ఆ గుర్తింపు కోసం మౌలిక వసతుల పరంగా ఇంకా అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉంది. కొన్ని రోడ్లు అద్భుతంగా ఉంటే కొన్ని అధ్వానంగా ఉన్నాయి. ఈ పరిస్థితిలో మార్పు రావాలి. గుంతల రోడ్లు అనేవి వెతికినా కనపడకుండా ఉండేలా చేయాలి. సిటీ ట్రాఫిక్ కూడా పెద్ద సమస్యే. ఫుట్‌పాత్ ఆక్రమణలు, రోడ్ల మీద వ్యాపారాలు ట్రాఫిక్‌కి అడ్డంకులు సృష్టిస్తున్నాయి. మరోవైపు పబ్లిక్‌లో కూడా ట్రాఫిక్ సెన్స్ లోపిస్తోంది. ప్రభుత్వాలు ఒక టాస్క్‌గా తీసుకుని ప్రజల్లో ట్రాఫిక్ రూల్స్ పట్ల అవగాహన బాగా పెంచాలి. నగరానికి నేచర్ లవర్స్ రాక పెంచడానికి వన్యప్రాణుల ఉనికి కాపాడడానికి శాంక్చురీస్(అభయారణ్యాలు)ని బాగా డెవలప్ చేయాలి.

– ప్రిన్స్, టాలీవుడ్ నటుడు

అభిమాన గజమాల!



ఖైరతాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి పి.విజయారెడ్డిని ఖైరతాబాద్ వాసులు అక్కున చేర్చుకుంటున్నారు. బుధవారం ఖైరతాబాద్ బడా గణేష్ చౌరస్తాలో ఆమె తండ్రి పీజేఆర్ విగ్రహం వద్ద కార్యకర్తలు భారీ గజమాలతో విజయారెడ్డిని సత్కరించారు. – ఖైరతాబాద్

ఆ రెండింటిపై వ్యూహమేంటి?



అధికార పక్షం దోస్తీ కోసం పాతబస్తీకే పరిమితమై ఎన్నికల బరిలో దిగే మజ్లిస్ పార్టీ ఈసారి అదనంగా మరో రెండు స్థానాల్లో అభ్యర్థులను పోటీలోకి దింపడం వెనుక వ్యూహమేంటి? గెలుపు కోసమా? మిత్ర పక్షమైన బీఆర్ఎస్‌కు లాభం చేకూర్చేందుకా? అనే చర్చ సర్వత్రా సాగుతోంది. బీఆర్ఎస్ సిట్టింగ్ స్థానాలైన జూబ్లీహిల్స్, రాజేంద్రనగర్ స్థానాల్లో ఎన్నికల బరిలో దిగింది. జూబ్లీహిల్స్ స్థానానికి షేక్‌పేట కార్పొరేటర్ మహ్మద్ రషీద్, రాజేంద్రనగర్ స్థానానికి లంగర్‌హౌజ్ మాజీ కార్పొరేటర్ బి.రవియాదవ్ అభ్యర్థిత్వాలను ఖరారు చేసింది. రెండు స్థానాలకు అభ్యర్థుల ప్రకటన తర్వాత మజ్లిస్ వ్యూహంపై ముస్లిం మేధావి వర్గాలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయి. జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ పక్షాన మాజీ క్రికెటర్ అజహరుద్దీన్ ఎన్నికల బరిలో దిగారు. ముస్లిం సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి కావడంతో రాజకీయాలకు అతీతంగా ముస్లిం మైనారిటీలు మొగ్గు చూపే అవకాశాలు లేకపోలేదు. మజ్లిస్ అభ్యర్థి రంగంలోకి దింపిన కారణంగా మైనారిటీ ఓట్లు చీలిపోయే ప్రమాదం లేకపోలేదని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. దీంతో పరోక్షంగా అధికార బీఆర్ఎస్ కాని బీజేపీ కాని లాభపడే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. –సాక్షి, సిటీబ్యూరో

భాంజా ఒవైసీ.. మామూ కేసీఆర్!



మేరే భారే మే జల్దీ మామూకు బోల్ దేరేం.. కుచ్ బీ నహీ హువా తోబీ మామూకు బోల్ రేం..(నేను ఏది చేసినా.. ఏది చేయకపోయినా.. కొంత మంది వెంటనే మామకు చెప్పేస్తున్నారు) అంటూ హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అంటున్నారు. ఆయన అంటున్నట్లుగానే కాంగ్రెస్ పార్టీ నాయకులు సైతం సీఎం కేసీఆర్, అసదుద్దీన్ ఒవైసీలను మామా అల్లుళ్లు అంటూ సంబోధిస్తున్నారు. నాంపల్లి బహిరంగ సభలో రాజేంద్ర నగర్ అభ్యర్థిని ప్రకటించిన అసదుద్దీన్ ఒవైసీ మాట్లాడుతూ.. అబ్ దేఖో మామూకు బీ గుస్సా ఆతా (మామకు కూడా కోపం వస్తుంది) అంటూ నవ్వుతూ అన్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరి.. ఇక మలక్‌పేట్ నియోజక వర్గం నుంచి పోటీ చేస్తున్న మాజీ కార్పొరేటర్ ముజఫర్ విలేకరులతో మాట్లాడుతూ.. తెలంగాణలోని ముస్లింలందరినీ భాంజా ఒవైసీ (అల్లుడు.. ఒవైసీ) మామూ (కేసీఆర్)కు దేదియే క్యా అంటూ మామా అల్లుళ్ల బంధాన్ని వివరించారు. – చార్మినార్

ప్రత్యర్థి 'పద్మ'లు ఒక్కటయ్యారు!



ఇద్దరు మహిళా నేతలు రెండుసార్లు కార్పొరేటర్ ఎన్నికల్లో పోటీ పడ్డారు. వీరిద్దరూ ఒక్కో దఫా విజయం సాధించారు. వీరిలో ఒకరు బీఆర్ఎస్ తరఫున పోటీ చేసిన కె.పద్మావతిరెడ్డి. మరొకరు బీజేపీ నాయకురాలు బి.పద్మా వెంకట్‌రెడ్డి. అంబర్‌పేట నియోజకవర్గంలోని బాగ్ అంబర్‌పేట డివిజన్ ఎన్నికల్లో రెండుసార్లు ప్రత్యర్థులుగా పోటీ పడిన వీరు.. చెరోసారి గెలిచారు. ప్రస్తుతం బీజేపీ నుంచి పద్మా వెంకట్‌రెడ్డి ఇటీవలే బీఆర్ఎస్ పార్టీలో చేరారు. మున్సిపల్ ఎన్నికల్లో హోరాహోరీగా తలపడిన ఇరువురు మహిళా నేతలు తాజాగా అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి కాలేరు గెలుపు కోసం ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారు. – అంబర్‌పేట్

ఎన్నికల 'దీపావళి'



భాగ్యనగరిలో ఈసారి దీపావళి స్పెషల్‌గా ఉండనుంది. ఎన్నికల నేపథ్యంలో విభిన్నమైన సందడి కన్పిస్తోంది. దీపావళి స్పెషల్ వివిధ రకాల స్వీట్లు, బాణసంచాకు ఈ ఏడాది భారీగా డిమాండ్ ఏర్పడింది. ఈ నెల 30న అసెంబ్లీ ఎన్నికల జరగనున్న నేపథ్యంలో ఆయా రాజకీయ పార్టీల నేతలు పండగ వేళ ఓటర్లకు బహుమతులు ఇచ్చేందుకు ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తోంది. ఈమేరకు గేటెడ్ కమ్యూనిటీలు, అపార్ట్‌మెంట్లు, కాలనీలు, ఉద్యోగ సంఘాల వారికి మిఠాయిలు, టపాసులు బాక్సుల రూపంలో ఇచ్చేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ప్రముఖ మిఠాయిల షాపులకు భారీగా ఆర్డర్లు ఇచ్చారట. దీంతో దీపావళికి మిఠాయి దుకాణాలకు ఈఏడాది రెట్టింపు గిరాకీ ఉండనుంది. మొత్తమ్మీద దీపావళి సందడిని రాజకీయ పార్టీలు ఓటర్ల మన్ననలు పొందడానికి ఉపయోగించుకుంటున్నారు. – సాక్షి, సిటీబ్యూరో

డాక్టర్ సంతోష్ కుమార్‌కు డాక్టరేట్



సంతోష్ కుమార్‌కు డాక్టరేట్ ప్రదానం చేస్తున్న గవర్నర్ తమిళిసై

లక్డీకాపూల్: ఐడీబీఐ జనరల్ మేనేజర్ డాక్టర్ డి.సంతోష్ కుమార్‌కు నల్గొండలోని మహాత్మా గాంధీ విశ్వ విద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. తెలంగాణ రాష్ట్రంలో గృహ రుణాలపై పరిశోధన పూర్తి చేసినందుకు వర్సిటీ చాన్స్‌లర్, గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ పీహెచ్‌డీని ప్రదానం చేశారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ డాక్టర్ రమేష్ కుమార్ మిర్యాల మార్గదర్శకత్వంలో ఆయన పరిశోధన పూర్తి చేశారు. మహాత్మాగాంధీ యూనివర్సిటీ మూడవ స్నాతకోత్సవంలో భాగంగా వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ గోపాల్ రెడ్డి స్నాతకోత్సవ నివేదికను సమర్పించారు.

ఉమ్రా యాత్రికులకు ఆత్మీయ స్వాగతం



హైదరాబాద్‌కు చేరుకున్న ఉమ్రా యాత్రికులు

శంషాబాద్: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటక, మహారాష్ట్ర నుంచి ఇటీవల ఉమ్రా యాత్రకు వెళ్లిన యాత్రికులు బుధవారం యాత్ర ముగించికుని హైదరాబాద్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా వారికి ఎయిర్‌పోర్టు వద్ద కుటుంబసభ్యులు, బంధువులు, స్నేహితులు ఘనంగా స్వాగతం పలికారు. యాత్రను అల్ మిజాన్ సంస్థ అధ్యక్షుడు ఫయాజ్ అలీ పర్యవేక్షించారు.

ఒంటరిగా ఉన్న జంటలే టార్గెట్

నూడో పోలీస్‌ను అరెస్టు చేసిన టాస్క్‌ఫోర్స్



సాక్షి, సిటీబ్యూరో: నెక్లెస్ రోడ్‌లో ఒంటరిగా ఉన్న జంటలను బెదిరించి వసూళ్లకు పాల్పడుతున్న నూడో పోలీసును మధ్య మండల టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. ఇతడిపై ఇప్పటి వరకు తెలుగు రాష్ట్రాల్లో 20 కేసులు నమోదైనట్లు డీసీపీ నితిక పంత్ బుధవారం వెల్లడించారు. జనగాంకు చెందిన మరాఠీ సృజన్ కుమార్ కొన్నేళ్ల క్రితం విశాఖలో ఎస్సైగా పని చేసిన శ్రావణిని వివాహం చేసుకున్నాడు. పెళ్లైన కొన్ని నెలలకే ఆమె ఆత్మహత్య చేసుకున్నారు. జల్సాలకు అలవాటు పడిన ఇతగాడు తేలిగ్గా డబ్బు సంపాదించడానికి నూడో పోలీసు అవతారం ఎత్తాడు. తన భార్య పోలీసు యూనిఫాంలో ఉన్న ఫొటోను తన ఫోన్‌లో పెట్టుకుని తిరిగే సృజన్ తానూ డమ్మీ తుపాకీతో దిగిన వాటినీ ఇలా సేవ్ చేసుకున్నాడు. టార్గెట్ చేసిన వ్యక్తులకు వీటిని చూపిస్తూ తాను పోలీసునని బెదిరిస్తాడు. కేసు పేరు చెప్పి వారి నుంచి అందినకాడికి దండుకుంటాడు. ఇలాంటి నేరాలు చేసిన నేపథ్యంలో సృజన్‌పై గతంలో నగరంలో పాటు విశాఖపట్నం, వరంగల్ సహా వివిధ ప్రాంతాల్లో 18 కేసులు నమోదయ్యాయి. ఇటీవల ఇతడు నెక్లెస్ రోడ్‌నే తన టార్గెట్‌గా మార్చుకున్నాడు. నెంబర్ ప్లేట్ లేని ద్విచక్ర వాహనంపై తిరుగుతూ అక్కడ ఒంటరిగా, ఏకాంతంగా ఉన్న జంటలను ఎంచుకుంటాడు. ఫోన్‌లోని ఫొటోలు చూపించి తాను పోలీసు అని, తనతో ఠాణాకు రావాలని గద్దిస్తాడు. ఇద్దరిపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాల్సి ఉందని భయపెడతాడు. అలా కాకుండా ఉండాలంటే తాను కోరిన మొత్తం ఇవ్వాలని బెదిరిస్తాడు. ఇలా రెండు జంటలను బెదిరించి డబ్బు దండుకున్నాడు. ఓ జంట నుంచి రూ.20 వేలు ఫోన్ పే చేయించుకున్నాడు. మరో జంట నుంచి ఈ పంథాలో రూ.99 వేలు తీసుకున్న సృజన్.. మరుసటి రోజు రూ.4 లక్షలు వసూలు చేశాడు. వీరి ఫిర్యాదుతో సెక్రటేరియేట్ ఠాణాలో రెండు కేసులు నమోదయ్యాయి. దీంతో మధ్య మండల టాస్క్‌ఫోర్స్ పోలీసులు రంగంలోకి దిగారు. ఇన్‌స్పెక్టర్ బి.రాజు నాయక్ నేతృత్వంలో ఎస్సైలు సీహెచ్.నవీన్‌కుమార్, ఎస్.సాయి కిరణ్ వలపన్ని బుధవారం నిందితుడిని పట్టుకున్నారు. విచారణ నేపథ్యంలో ఇతడిపై ఆసిఫ్‌నగర్‌లో రెండు ఎన్‌బీడబ్ల్యూలు పెండింగ్‌లో ఉన్నట్లు తేలింది. సృజన్ నుంచి రూ.1.38 లక్షల నగదు, వాహనం, ఫోన్లు స్వాధీనం చేసుకుని తదుపరి చర్యల నిమిత్తం సెక్రటేరియేట్ పోలీసులకు అప్పగించారు. ఇతడు సూర్య, చరణ్, చెర్రీ పేర్లతోనూ చెలామణి అయినట్లు గుర్తించారు.

నకిలీ కరెన్సీ ముఠా అరెస్ట్

ఇద్దరి అరెస్ట్... రూ.2.9 లక్షల నకిలీ కరెన్సీ స్వాధీనం



స్వాధీనం చేసుకున్న నకిలీ నోట్లు



నకిలీ నోట్లను తయారు చేస్తున్న నిందితులు

శంషాబాద్: నకిలీకరెన్సీ తయారి చేసి వాటిని చలామణి చేస్తున్న ముఠాను శంషాబాద్ ఎస్ఓటీ పోలీసులు ఛేదించారు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నర్సారావు పేట జిల్లా గురజాలకు చెందిన ఎస్.వెంకటేశ్వర్లు (45) నగరంలో ఎల్‌బీనగర్‌లో నివాసముంటూ సివిల్ కాంట్రాక్టరుగా చేస్తున్నాడు. జల్సాలకు అలవాటు పడిన అతడికి సంపాదన సరిపోకపోవడంతో సులభంగా సంపాదించేందుకు శంషాబాద్ వెంగళరావు కాలనీలో నివాసముంటున్న గురజాలకు చెందిన శ్రీనివాస్ (44)తో కలిసి పథకం వేశాడు. నకిలీ కరెన్సీ తయారీకి కొందరు ఏజెంట్లను సంపాదించి, అందుకు సంబంధించిన ప్రింటర్లు ఇతర వస్తువులు సమకూర్చుకున్నారు. శ్రీనివాస్ ఇంట్లోనే ఓ గదిలో వాటిని ఏర్పాటు చేసి నకిలీ ఐదు వందలు, వంద నోట్లను తయారు చేయడం ప్రారంభించారు. రద్దీ ప్రాంతాలైన మార్కెట్లు తదితర ప్రాంతాల్లో వాటిని చలామణి చేయడం ప్రారంభించారు. ఏజెంట్ల ద్వారా ఏపీ, కర్నాటక తదితర రాష్ట్రాలకు కూడా వాటిని సరఫరా చేశారు. విశ్వసనీయ సమాచారం అందుకున్న శంషాబాద్ ఎస్ఓటీ పోలీసులు బుధవారం ఉదయం దాడులు చేశారు. వెంకటేశ్వర్లు, శ్రీనివాస్‌లను అరెస్ట్ చేయడంతో పాటు 2.9 లక్షల నకిలీ నోట్లను స్వాధీనం చేసుకున్నారు. ఏడు లక్షల విలువ చేసే ప్రింటర్లు, కారు, ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

బాంటియాలో మహా సీజన్ స్పెషల్ సేల్

సాక్షి, సిటీబ్యూరో: ప్రముఖ ఫర్నిచర్ ఉత్పత్తుల బ్రాండ్ బాంటియా ఫర్నిచర్స్..మహా సీజన్ స్పెషల్ సేల్‌ను అందిస్తోంది. దీనిలో భాగంగా అన్ని రకాల ఫర్నిచర్ ఉత్పత్తులపైనా 63 శాతం వరకూ తగ్గింపుతో పాటు దీనిని ఎక్స్‌ఛేంజ్ ఆఫర్‌కూ వర్తింపజేస్తున్నట్టు సంస్థ ప్రతినిధులు తెలిపారు. అదే విధంగా రూ.99,999 విలువైన కొనుగోళ్లు చేసిన వారికి యాక్టివా, రూ.69,999 మొత్తానికి సరిపడా కొనుగోళ్లు చేసిన వారికి బంగారు నాణెం, రూ 59,999 కొనుగోలుపై థాయ్‌ల్యాండ్‌కి ప్రయాణం టికెట్ వంటి ఉచిత బహుమతులు అందిస్తున్నామన్నారు.

కూకట్‌పల్లిలో బుధవారం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బండి రమేశ్ విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యకర్తలు, నేతలతో కలిసి కాలనీల్లో తిరుగుతూ..ప్రజలను కలుస్తూ తనకు ఓటు వేసి గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



విశ్వరూప సభకు ప్రధాని రావడం గర్వకారణం



మాదిగ, ఉపకులాల విశ్వరూప మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంద కృష్ణమాదిగ తదితరులు

మంద కృష్ణమాదిగ

పంజగుట్ట/జియాగూడ: మాదిగ, మాదిగ ఉపకులాలకు చేయూతనిచ్చేందుకు, వారి ఆకాంక్షలను నెరవేర్చేందుకు ప్రధాని నరేంద్ర మోదీ స్పందించడం గర్వంగా భావిస్తున్నామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అన్నారు. 60 సంవత్సరాల నిరీక్షణ, 30 సంవత్సరాల ఉద్యమ సంకల్పం ప్రధాని తీసుకునే నిర్ణయంలో, ఇచ్చే సందేశంపై ఆధారపడి ఉందన్నారు. ఈ నెల 11వ తేదీన సికింద్రాబాద్ పరేడ్‌గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న మాదిగ, ఉపకులాల విశ్వరూప మహాసభకు సంబంధించిన పోస్టర్‌ను సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ వర్గీకరణకు కట్టుబడి ఉన్నామని జులై 8వ తేదీన వరంగల్ సభలో చెప్పారని, అక్టోబర్ 2వ తేదీన ఢిల్లీలో అమిత్‌షాను కలిసినప్పుడు ఆయన కూడా సానుకూలంగా స్పందించారని, ఆ హామీని అమలుచేసే దిశగా ఈ సభ ఉంటుందని భావిస్తున్నట్లు తెలిపారు. ఈ సభకు మోదీ రావడం గొప్ప విషయమన్నారు. కాగా బుధవారం కార్వాన్ నియోజకవర్గం మాదిగల విశ్వరూప సన్నాహక సభ జియాగూడ ఇంద్రానగర్ ఆదిజాంభవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరగ్గా..మంద కృష్ణ హాజరై మాట్లాడారు. మాదిగ జాతికి గత కొన్ని సంవత్సరాల నుండి కాంగ్రెస్, బీఆర్ఎస్ అన్యాయం చేస్తూ వచ్చాయన్నారు. ఈ నెల 11న ఏర్పాటు చేసిన బహిరంగ సభకు ప్రధాని నరేంద్రమోదీ హాజరవుతున్నారన్నారు.

నగరంలో 14 మంది ఇన్‌స్పెక్టర్ల బదిలీ

ఉత్తర్వులు జారీ చేసిన కొత్వాల్

సాక్షి, సిటీబ్యూరో: నగర కమిషనరేట్ పరిధిలో 14 మంది ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ కొత్వాల్ సందీప్ శాండిల్య బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల ఖాళీ అయిన చిక్కడపల్లి, బోరబండ ఠాణాలకు ఇన్‌స్పెక్టర్లను నియమించారు. కొత్త ఇన్‌స్పెక్టర్లు తక్షణం బాధ్యతలు తీసుకోవాలని కొత్వాల్ ఆదేశించారు. పరిపాలన పరమైన కారణాల నేపథ్యంలో ఈసీ అనుమతి తీసుకుని ఈ బదిలీలు చేశారు. కీలక పోస్టింగ్స్ ఇలా...

అధికారి	ప్రస్తుతం	బదిలీ అయిన స్థానం
ఎ.సీతయ్య	చాదర్‌ఘాట్ డీఐ	చిక్కడపల్లి
ఎస్.విజయ్	కామాటిపుర డీఐ	బోరబండ
పి.లక్ష్మీకాంత్‌రెడ్డి	అఫ్జల్‌గంజ్ డీఐ	సైఫాబాద్
జి.నరేష్ కుమార్	ఎస్బీ	ఈస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్
ఎస్.సైదాబాబు	టాస్క్‌ఫోర్స్ అడ్మిన్	సౌత్ ఈస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్
ఎల్.భాస్కర్‌రెడ్డి	సైబర్ క్రైమ్స్	నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్
బి.మధుసూదన్	ట్రాఫిక్ అడ్మిన్	సౌత్ జోన్ టాస్క్‌ఫోర్స్





జూబ్లీహిల్స్ పెద్దమ్మ గుడి సమీపంలో బుధవారం రిలయన్స్ రిటైల్ స్వదేశ్ తొలి అవుట్‌లెట్‌ను ప్రారంభించిన కార్యక్రమంలో పాల్గొన్న రిలయన్స్ ఫౌండేషన్ ఫౌండర్ ఛైర్‌పర్సన్ నీతా అంబానీ, సానియా మీర్జా, పీవీ సింధు, సైనా నెహ్వాల్, నమ్రతా శిరోడ్కర్, సుధారెడ్డి

ప్రచార పర్వం

● జైకొట్టి.. హారతి పట్టి



హస్తినాపురంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎల్‌బీనగర్ బీఆర్ఎస్ అభ్యర్థి దేవిరెడ్డి సుధీర్‌రెడ్డికి గిరిజన మహిళలు ఇలా హారతి పట్టారు. – హస్తినాపురం



శ్రీనివాస్‌నగర్ కాలనీ వాసులతో సమావేశమైన కుత్బుల్లాపూర్ బీజేపీ అభ్యర్థి కూన శ్రీశైలంగౌడ్.

● పూజలు చేసి.. నామినేషన్ వేసి..





ఖైరతాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి దానం నాగేందర్ బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. ఉదయం బంజారాహిల్స్ రోడ్ నెం.3లోని తన నివాసంలో పూజలు నిర్వహించిన అనంతరం భార్య, అనిత, ఇద్దరు కూతుళ్లు, అల్లుడు హారతి ఇచ్చి ఆశీర్వదించారు. – బంజారాహిల్స్

● గెలిపించండి..అభివృద్ధి చూపిస్తా



హయత్‌నగర్ రంగనాయకులగుట్టలో బుధవారం ఎల్‌బీనగర్ బీజేపీ అభ్యర్థి సామ రంగారెడ్డి విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీజేపీకి ఓటు వేస్తే అభివృద్ధి చేసి చూపిస్తామని హామీ ఇచ్చారు. – ఎల్‌బీనగర్

● ఉండన్నా...బొట్టు పెడతా



పార్సిగుట్టలో ముషీరాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి ముఠా గోపాల్ బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా తిలకం దిద్దుతున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ – ముషీరాబాద్

● 'చేతి'ని గుర్తుంచుకోండి..



అంబర్‌పేట కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ రోహిణ్‌రెడ్డి బుధవారం నామినేషన్ వేశారు. ఈ సందర్భంగా ఆయన నల్లకుంట నుంచి కార్యకర్తలతో కలిసి ర్యాలీగా వెళ్లారు. –అంబర్‌పేట